క్లుప్తంగా

నేడు నీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: జోన్–4 పరిధిలో మెయిన్ పైప్‌లైన్ లీక్ కారణంగా మరమ్మతు పనులు చేపడుతున్న దృష్ట్యా 35వ వార్డు నుంచి 39వ వార్డు వరకు గురువారం తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పండావీధి, ప్రసాద్‌గార్డెన్స్, కల్లుపాకలు, మంతావారివీధి, రంగిరీజువీధి, గన్నేరు వీధి, జబ్బర్‌తోట, గొడారిగోతులు, కొత్త అగ్రహారం, పెయిందొరపేట, కుంచుమాంబ గుడి, విపర్తివారి వీధి, చిన్నంవారి వీధి, టౌన్‌హాల్ రోడ్డు, సోల్జర్‌పేట, కోటవీధి, ఫెర్రీరోడ్డు, చిలకపేట జంక్షన్, గంగులవారి వీధితో పాటు 35 నుంచి 39 వార్డుల్లో గల పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. మెయిన్ పైపులైన్ మరమ్మతులు పూర్తయిన వెంటనే యథావిధిగా నీటి సరఫరా పునరుద్ధరణ జరుగుతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి


జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: నియోజకవర్గంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని జీవీఎంసీ జోన్–4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. సచివాలయాల్లో ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. సచివాలయాల్లో దరఖాస్తును పూర్తి చేసి ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం ఫొటో అందజేయాలన్నారు. అలాగే ఓటరు కార్డులో చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారింటికి బీఎల్‌వోలు (బూత్ లెవల్ ఆఫీసర్లు) వచ్చి విచారణ చేసిన తర్వాత ఓటర్ కార్డును నెట్ సెంటర్‌లో ప్రింట్ తీసుకోవాలని తెలిపారు. ఈ అవకాశం ఈనెల 24 వరకు మాత్రమే ఉంటుందని ఆయన చెప్పారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జగదాంబ: ప్రజలు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం 35వ వార్డు ప్రసాద్ గార్డెన్స్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఇన్‌చార్జి తహసీల్దార్ జిలానీ, స్థానిక కార్పొరేటర్ భాస్కరరావు, మాజీ కార్పొరేటర్ ఆనంద్, స్థానిక కూటమి అధ్యక్షుడు త్రినాథ్, రాము రెడ్డి, నాయకులు రఘు, సతీష్, గుణ, రెహమాన్, నగేష్, కళావతి, అరుణ, శ్రీను పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అన్నసమారాధన


అన్న ప్రసాదం స్వీకరిస్తున్న మానసిక దివ్యాంగులు

అల్లిపురం: వివేకానందకాలనీలో గల సాయి శ్రీ మేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మానసిక దివ్యాంగులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం హిడన్ స్ప్రౌట్స్ స్పెషల్ స్కూల్ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

చెట్లు మానవాళికి భగవంతుని వరప్రసాదితం అని చెప్పాలి. ఒక పెద్ద చెట్టు 10 ఎయిర్ కండీషనర్ యూనిట్లకు సమానం. చెట్టు నీడ ఆరు బయలు ప్రాంతాల్లో 30 శాతం వరకు ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. శబ్ద కాలుష్యాన్ని 50 శాతం వరకు అరికడుతుంది. గాలిలో ఉండే హానికారక కాలుష్యాలను చెట్లు పెద్ద మొత్తంలో తగ్గించగలవు. అవి నీటిని కూడా పెద్ద మొత్తంలో నిల్వ చేయగలవు. నీటి పారుదలను తగ్గించి వరదల తీవ్రతను తగ్గిస్తాయి. పచ్చని చెట్లు కంటికి, మానసిక ఆరోగ్యానికి కూడా ఎంతగానో దోహదపడతాయి. ఇన్ని సేవలు చేస్తున్న చెట్లు పోర్టు పరిసరాల్లో మాత్రం నానాటికీ తమ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. దీనికి కారణం కాలుష్యం. ఈ కారణంగా అవి ప్రాణి కోటిని రక్షించే తమ సహజ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. **పూర్తి స్థాయిలో ఆక్సిజన్‌ను అందించలేకపోతున్నాయి.**


పోర్టు రోడ్డులో చెట్లకు కాలుష్యం సెగ

పచ్చదనానికి.. కాలుష్యం సెగ

- నల్లగా మాడి సహజ సామర్థ్యాన్ని కోల్పోతున్న చెట్లు
- సంరక్షణ కరవై ఉనికి కోల్పోయే ప్రమాదం
- అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికుల వినతి


కాలుష్య సెగతో నల్లగా మారిన చెట్లు

దాబాగార్డెన్స్: పచ్చని చెట్టు **ప్రగతికి మెట్టు.** జీవకోటికి ప్రాణవాయివు అం**దించే పచ్చదనాన్ని** కాపాడుకోవడం మనందరి బా**ధ్యత. చెట్లు చాలా** ముఖ్యమైనవి.. విలువైనవి. మా**నవ మనుగడకు** ఎంతో అవసరం. ఆహారంగా.. **ఆక్సిజన్‌గా చెట్లు** మానవాళికి ఎంతో సేవ చేస్తున్నాయి. వాతావరణంలో వస్తున్న అనేక మార్పుల నుంచి.. ఓజోన్ పొర దెబ్బ తినకుండా పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క నాటాలని ప్రజా ప్రతినిధులు పిలుపునిస్తుంటారు. అటువంటి హరిత వనాలు కాలుష్యం కాకుండా కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉంది. కానీ విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ పరిసర ప్రాంతాల్లో గల వేలాది మొక్కలు, చెట్లు కాలుష్యం బారిన పడుతున్నాయి. మానవాళిని కాపాడుతున్న మొక్కలు.. చెట్లే కాలుష్యానికి గురవుతుంటే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేం.


పోర్టు గ్రీన్‌బెల్ట్‌లో పరిస్థితి ఇదీ

సంరక్షణ ఏదీ?

ఆర్భాటంగా మొక్కలు నాటుతున్నారు. కానీ వాటిని సంరక్షించే విషయంలో స్పందన కరవవుతోంది. వాస్తవానికి పోర్టు పరిసర ప్రాంతాల్లో కాలుష్యం కారణంగా ఉదయం.. సాయంత్రం వేళల్లో ట్యాంకర్ల ద్వారా రోడ్లు తడిపేవారు. ఎటువంటి బొగ్గు గాల్లోకి ఎగరకుండా చర్యలు చేపట్టేవారు. కానీ ప్రస్తుతం ఆ పనినే మరచిపోయినట్టుంది. ఫలితంగా భారీ వాహనాల రాకపోకల సమయంలో ఉవ్వెత్తున ఎగసి పడుతున్న దుమ్ము.. ధూళి చెట్ల కొమ్మలు.. ఆకులపై పడి నాశనం అవుతున్నాయి.


పచ్చని మొక్కలపై బొగ్గు.. కాలుష్యం ఆవరించిన దృశ్యం

కాలుష్యం బారిన హరిత వనాలు..

విశాఖపట్నం పోర్టు పరిసర ప్రాంతాలైన **జ్ఞానాపురం, కోటవీధి, ఫెర్రీరోడ్డు,** థామ్సన్ స్ట్రీట్, **పద్మానగర్, అల్లిపురం,** కొబ్బరితోట, **మహారాణిపేట,** జాలారిపేట, బీచ్‌రోడ్డు, **రెల్లివీధితో పాటు విశాఖపట్నం** పోర్టు ట్రస్ట్‌లో గత **కొన్నేళ్లుగా నాటిన మొక్కలు** కాలుష్యం బారిన పడి నల్లగా మాడిపోతున్నాయి. దీంతో మానవాళికి అవసరమైన ఆక్సిజన్ సరఫరా చేయడంలో అవి సమర్థవంతంగా పని చేయలేకపోతున్నాయి.

నిషేధిత ప్లాస్టిక్ వాడరాదు


వినియోగదారులతో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగించరాదని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. బుధవారం ఆయన జోన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా రామకృష్ణా జంక్షన్ వద్ద ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న వినియోగదారులతో మాట్లాడారు. జనవరి 1 నుంచి ప్లాస్టిక్ కవర్లు పూర్తిగా నిషేధింపబడతాయన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వదిలి గుడ్డ, నార సంచులు ఉపయోగించాలని తెలిపారు. అలాగే ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేసి ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధింపజేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశించారు. తోపుడుబండ్లు, టిఫిన్ సెంటర్లు, చిరు వ్యాపారుల వద్ద కూడా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం జరగరాదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో వాకర్స్ క్లబ్ అభివృద్ధి

మురళీనగర్: అందరి సహకారంతో వాకర్స్ క్లబ్ అభివృద్ధి పథంలో పయనించిందని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. బుధవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లబ్ అభివృద్ధికి సభ్యులు కష్టపడి పని చేసిన తీరును గుర్తు చేసుకున్నారు. అనేక సేవా కార్యక్రమాలు విజయవంతంగా చేపట్టామన్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఆర్.సత్యనాథం మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి ప్రస్తుత అధ్యక్షుడు చంద్రమౌళి కార్యదీక్షతతో పని చేశారన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన క్లబ్ సభ్యులను అభినందించారు.

వ్యాధులు సంభవిస్తే తక్షణం సమాచారం ఇవ్వండి


దండుబజార్‌లో ప్రజలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడైనా ఏ విధమైన వ్యాధులు సంభవించినా తక్షణం స్థానిక పట్టణ వైద్య ఆరోగ్య కేంద్రానికి గాని, లేదా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి దృష్టికి గాని తీసుకు రావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం చెంగలరావుపేట పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధి దండుబజార్–1 సచివాలయాన్ని ఆయన సందర్శించారు. వ్యాధి నిరోధక టీకాలు, ఇతర ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. నేషనల్ కమ్యూనిటీ డిసీజెస్–3 సర్వేపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో నోడల్ అధికారి డాక్టర్ బి. ఉమావతి, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై వినతి


జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న 41వ వార్డు కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సమస్యలపై బుధవారం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు మాజీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ వినతిపత్రం అందించారు. వార్డులో మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ వద్ద ఉన్న షాపులకు కరెంటు సదుపాయం కల్పించాలని, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్య, సెబాస్టియన్ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణం, వీధి కుక్కల సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు.

మరింత ఆహ్లాదకరంగా సెంట్రల్ పార్క్


వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్


సీతమ్మధార: విశాఖ సెంట్రల్ పార్క్‌లో మరింత ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్ ఎదురుగా ఉన్న విశాఖ సెంట్రల్ పార్క్‌ను మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. పార్క్‌లో ఉన్న వాకర్లతో మాట్లాడి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న అన్ని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సెంట్రల్ పార్క్‌లో మరిన్ని సౌకర్యాల కల్పనకు ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. అనంతరం వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ అతి త్వరలో పార్క్‌లో మ్యూజికల్ ఫౌంటెన్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. పార్క్‌కి వచ్చే పిల్లల కోసం క్రీడా పరికరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఓపెన్ జిమ్ పరికరాల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పార్క్ ఆవరణలో దివీస్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి ప్లాంట్‌ను ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కమిషనర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ సీఈ భవానీ శంకర్, డీఎఫ్‌వో శివానీ, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జబ్బర్‌తోట డయేరియాపై చర్చ


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ చెన్నా జానకీరామ్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ పలు అంశాలు లేవనెత్తారు. గతంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో వార్డు పరిధిలో నీటి కాలుష్యంపై సభ ముందుకు తీసుకొచ్చినా పరిష్కారం కాకపోయిన కారణంగా జబ్బర్‌తోటలో ఇటీవల డయేరియా సోకి పలువురు ఆస్పత్రి పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు డయాలసిస్‌కు చేరుకున్నారని చెబుతూ ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

నమ్మండి.. ఇది బస్టాపే..


పాతనగరం.. పేరుకు తగ్గట్టు ఈ ప్రాంతం అభివృద్ధికి దూరంగా పాతగా ఉంటుంది. దానికి చక్కటి ఉదాహరణ ఈ చిత్రంలో కనిపిస్తున్న బస్ స్టాపే. జీవీఎంసీ 35వ వార్డు తారకరామానగర్‌లోని ఈ బస్టాప్ ఎప్పుడు నిర్మించారో తెలియదు కానీ ఇలా పాతబడి రూపురేఖలు కోల్పోయినా ఎలాంటి నవీకరణకు నోచుకోక ఇలా ఉంది. – జగదాంబ

కనకమహాలక్ష్మికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 10వ రోజు బుధవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో..

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రెండో గురువారం పూజలకు ఏర్పాట్లు పూర్తి..

టౌన్‌కొత్తరోడ్డు నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500 క్యూలైన్ల టికెట్లు అక్కడే ఇస్తారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీఐపీ, వీవీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించనున్నారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం(వీటీ కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ సమీపంలో పోలీస్ అవుట్‌పోస్ట్‌తో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. టౌన్‌కొత్తరోడ్డు, ఘోషాసుపత్రి, అమ్మవారి ఆలయం వెనుక భాగంలో చెప్పుల స్టాండ్ ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా గట్టి బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగుల కోసం వీల్‌చైర్లు సిద్ధం చేశారు.

పగలే వెన్నెల



ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రధాన జంక్షన్‌లో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు
– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బాలసంజీవని పంపిణీ

సీతమ్మధార : అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలసంజీవని నెల వారీ సరకులను బుధవారం అందజేశారు. జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపం దరి అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు సోడిపిండి రెండు కిలోలు, అటుకులు కిలో, చెక్కీలు పావుకిలో, బెల్లం పావు కిలో, ఎండు ఖర్జూరం పావు కిలో, బియ్యం మూడు కిలోలు, కందిపప్పు కిలో, అర కిలో నూనె వంతున అందజేశారు. అలాగే 25 గుడ్లు, ఐదు లీటర్ల పాలు వంతున అందజేశారు. ఈ కేంద్రంలో గల 30 మంది గర్భిణులు, 33 మంది బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్త గౌరి సరకులు అందజేశారు.

కుటుంబం చెంతకు యువకుడు


కార్తీక్‌ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకుని కుటుంబం చెంతకు చేరిన ఐటీఐ విద్యార్థి కథ ఇది. ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని కోలా జిల్లా, ఊర్గం గ్రామానికి చెందిన కార్తీక్ ప్రేమ్ చంద్ (26) వెల్డింగ్ ట్రెనింగ్ పూర్తి చేసి అప్రంటిస్ కూడా చేశాడు. తర్వాత మతిస్థిమితం కోల్పోయి 7 నెలల క్రితం కర్ణాటక నుండి విశాఖపట్నం వచ్చేసి, రోడ్ల మీద తిరుగుతుంటే ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రెండవ పట్టణ పోలీసులు చూసి ఏయూటీడీ సిబ్బందికి అప్పగించారు. ఏయూటీడీ ఆధ్వర్యంలో చినవాల్తేరులో గల ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చేర్పించి డాక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలో రెండు సార్లు చికిత్స చేయించారు. ప్రేమ్‌చంద్ కోలుకోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తండ్రి కపిల్ కుమార్, చిన్నాన్న రవికుమార్‌ను షెల్టర్‌కి రప్పించి ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో వారికి బుధవారం క్షేమంగా అప్పగించారు. ఈ కార్యక్రమంలో వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు దగ్ధం చేయండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపు

అల్లిపురం: కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచి ప్రజలపై భారం వేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులను ప్రజలు, వ్యాపారులందరూ బహిరంగా దగ్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జగదాంబ దరి సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన విశాఖ జిల్లా కమిటీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో నలభై శాతం ప్రజలపై భారం మోపిందన్నారు. చిన్న షాపుల యజమానులు గత నెలలో రూ.600 కడితే డిసెంబర్‌లో రూ.1100 బిల్లు వచ్చిందన్నారు. 40 నుంచి 80 శాతం వరకు భారీగా రేట్లు పెంచారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2021–22 సంవత్సరానికి గాను ఈ నాలుగు రకాల ఛార్జీలు వేయడానికి సిద్ధం చేసింది కనుక అది తప్పనిసరిగా కట్టాల్సిందేనని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు మోపితే ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వ్యతిరేకించారన్నారు. అలాగే స్మార్ట్ మీటర్లు పెడితే వాటిని ధ్వంసం చేయండని లోకేష్ పిలుపునిచ్చారన్నారు. అధికారంలో లేనప్పుడు ఒక మాట వచ్చాక ఇంకొక మాట మాట్లాడటం సరి కాదన్నారు. ఈ భారం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అదే విధంగా గంగవరం పోర్టును స్వాధీనం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇస్తున్న సామాజిక పింఛన్, ఉపాధి హామీ పథకంలో కోతలు పెట్టేందుకు కొత్తగా సర్వేలు జరపడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. విశాఖ పోర్టులో డ్రగ్స్ షిప్‌ను పట్టుకున్న సీబీఐ ఇప్పుడు ఆ షిప్‌లో ఏమీ లేదని తేల్చడం వెనుక మహా కుంభకోణం ఉందన్నారు. మోదీ మాయలో పడి ఆ షిప్‌ను వదిలేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. టన్నుల కొద్దీ రేషన్ బియ్యం కాకినాడ, విశాఖ పోర్టుల నుంచి అక్రమంగా తరలిపోతుండగా పట్టుకున్న కూటమి ప్రభుత్వం ఏ ఒక్కరిపైనా కేసులు పెట్టలేదన్నారు. రాజకీయంగా హడావుడి చేస్తున్నారే తప్ప ఒక్కరినీ అరెస్ట్ చేయకపోవడం వెనుక ఇంకో కుంభకోణానికి కూటమి నాయకులు పాల్పడినట్టు ప్రజలు భావిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొని మాట్లాడారు.

అలుముకున్న దుర్గంధం..


రెల్లివీధిలో చెత్తకుండీ నిండిపోయి దుర్గంధం వెలువడుతోంది. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం